## క్లుప్తంగా


### మాతా సన్నిధిలో పూజలు



భక్తులచే ఉద్యాపన పూజలు చేయిస్తున్న అర్చకులు

భామిని: ఆంధ్రా – ఒడిశా సరిహద్దు బత్తిలిలో వెలిసిన సంతోషిమాత ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆంధ్రా – ఒడిశా గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఉద్యాపనలు, కుంకుమ పూజలు చేయించారు. ఆలయ ప్రధానార్చకుడు రంపా తాత బాబు శర్మ, అర్చకులు సీతారాం భట్టు ఆధ్వర్యంలో మహిళల చేత ప్రత్యేక పూజలు చేయించారు.

### గెడ్డగూడలో నీటి సమస్య



చెలమ నీటిని సేకరిస్తున్న గెడ్డగూడ గ్రామస్తులు

కురుపాం: మండలంలోని జరడ, పంచాయతీ గెడ్డగూడ గిరిజన గ్రామంలో వేసవికి ముందే నీటి సమస్య నెలకొందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి ఎద్దడి కారణంగా గ్రామ సమీపంలో చెలమ నీటినే తీసుకొని వెళ్తున్నామని గ్రామస్తులు తెలిపారు. ఇప్పటికే ఇంటింటికి కుళాయి పథకం మంజూరైనా కార్యరూపం దాల్చలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

### పేదలకు దుప్పట్ల పంపిణీ



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న యువసేన సభ్యులు

భామిని: మండలంలోని పెద్దదిమిలి ఎస్టీ కాలనీలో పేదలకు స్థానిక యువసేన ఫౌండేషన్ సభ్యులు ఉలెన్ దుప్పట్లు శుక్రవారం పంపిణీ చేశారు. గిరిజన కాలనీ వాసుల చలి కష్టాలు చూసి చలించిన ఫౌండేషన్ సభ్యులు వీటిని అందజేశారు. ఫౌండేషన్ అధ్యక్ష కార్యదర్శులు బుయ్యాల భగవాన్ నాయుడు, అలజింగి గోవింద, పెద్దాడ భాస్కరరావు ఆధ్వర్యంలో సభ్యులు ఇంటింటికి వెళ్లి దుప్పట్లు పంపిణీ చేశారు.

### 'భోజనం' రుచిగా ఉండాలి



మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న ఎంపీటీసీ, సర్పంచ్

భామిని: మండలంలోని బాలేరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని ఎంపీటీసీ కొత్తకోట చంద్రశేఖర్, సర్పంచ్ జామి ప్రభాకర్ ఆధ్వర్యంలో పరిశీలించారు. పీఎంసీ చైర్మన్ కె.ఆంజనేయులతో కలిసి మెనూ ప్రకారం చేసిన ఎండీఎం వంటలను రుచి చూశారు. విద్యార్థుల ఆరోగ్యం మెరుగుపడేలా భోజనం ఉండాలన్నారు. భోజన నాణ్యతపై రాజీ పడవద్దని సూచించారు. విద్యార్థులకు భోజనం వడ్డించారు. వారి వెంట హెచ్ఎం జామి రమేష్, తెలుగు ఉపాధ్యాయుడు నిమ్మల మోహనరావు ఉన్నారు.

### 'చేదోడు' దరఖాస్తులపై ఆరా



శిఖబడి సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ రమేష్

జియ్యమ్మవలస: మండలంలోని శిఖబడి సచివాలయంలో చేదోడు దరఖాస్తులపై ఎంపీడీఓ ఎస్.రమేష్ శుక్రవారం ఆరా తీశారు. చేదోడు దరఖాస్తులు ఎంతవరకు అప్లోడ్ అయ్యాయని ఆరా తీయగా 46 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని వెల్ఫేర్ అసిస్టెంటు తెలపగా కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆదాయ ధ్రువపత్రాలు అందజేయలేదని తెలిపారు. వెంటనే తహసీల్దార్‌ను ఫోన్‌లో మాట్లాడి ఆదాయ, ధ్రువపత్రాలు లబ్ధిదారులకు అందేటట్లు చర్యలు తీసుకున్నారు. దానితో లబ్ధిదారులు ఊపిరి పీల్చుకున్నారు.

### హంస వాహనం వితరణ



హంస వాహనంపై దర్శమిస్తున్న జ్ఞాన సరస్వతిదేవి

పాలకొండ రూరల్: నక్కల పేటలో వేంచేసి ఉన్న జ్ఞానసరస్వతీ ఆలయానికి పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు బెజ్జిపురపు లక్ష్మినారాయణ దంపతులు రూ.25వేల విలువ గల హంసవాహనం వితరణగా అందించారు. ఈ వాహనంపై శుక్రవారం అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త, పి.కొండలరావు, అర్చకులు పి.శరత్‌కుమార్‌ల నేతృత్వంలో ప్రత్యేక పూజలు చేపట్టారు.

# పుచ్చకాయల సాగుకు సమయమిదే..

- ఉద్యానవన శాఖాధికారిణి అమరేశ్వరి



సేద్యమవుతున్న పుచ్చ పంట



టి.అమరేశ్వరి

పాలకొండ రూరల్: వేసవి నేపథ్యంలో దాహార్తిని తీర్చటంతో పాటు అనేక పోషక విలువలు కలిగిన పంట పుచ్చకాయలు. ప్రస్తుత సీజన్‌లో ఈ పంటను వేయడం ద్వారా లాభాలు ఆర్జించవచ్చని ఉద్యానవన శాఖాధికారిణి టి.అమరేశ్వరి తెలిపారు. పుచ్చకాయల సేద్యంలో సమగ్ర మెలకువలు, నీటి యాజమాన్యం, సస్యరక్షణ చర్యలపై వివరించారు. ఆసక్తి గల రైతులు అధికారులను సంప్రదించాలన్నారు.

**సేద్యంలో అంతర కృషి**

పుచ్చ పంటలో కలుపు నివారణలో భాగంగా అంతర కృషి అవసరం ఉంటుందన్నారు. కలుపు నివారణకు పెండిమిథాలియన్ 1.5 లీటర్లు ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పంట వేసిన 48 గంటల్లోగా పిచికారీ చేయడం వలన మంచి ఫలితాలుంటాయి. ఆకు దశలో మూడు గ్రాములు బోరాక్స్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే ఆడతూలు అధికంగా వచ్చి దిగుబడి పెరుగుతుందన్నారు. పూత రావడానికి ముందుగా తీగ చివరిలో తుంచడం వల్ల పక్క తీగలు పెరిగి దిగుబడి పెరిగేందుకు అవకాశాలుంటాయి. కాయ పెరుగు దశలో వారానికి ఒకసారి కాయలు తిప్పుతూ ఉండాలని తద్వారా మచ్చలు ఏర్పడకుండా కాయ మంచి రూపం చెందుతుందని గుర్తించాలని సూచించారు.

**ఎరువుల వాడకం**

ఎకరాకు 4 నుంచి 5 టన్నుల వరకు సేంద్రియ ఎరువుల్లో భాగంగా పశువుల ఎరువులను అందించాలి. దీంతో పాటు 40 కిలోల భాస్వరం, పొటాష్‌యం 24, నత్రజని 40 కిలోలు సమకూరే ఎరువులు వేయాలని సూచించారు. పంట వేసిన 25 రోజుల తరువాత నత్రజనిని మరో మారు వేసుకోవడం వలన ఉత్తమ ఫలితాలు వస్తాయన్నారు.

**నీటి యాజమాన్యం**

పంట మొలకెత్తిన తరువాత 7 నుంచి 10 రోజుల వ్యవధిలో నీరు అందించాల్సి ఉంటుందని, అలాగే కాయలు నేలకు తాకి ఉండడం వలన నీరు కాయకు తగిలితే కుళ్లిపోయే అవకాశం ఉన్నందున జాగ్రత్తలు పాటించాలన్నారు. కాయ పెరిగే దశలో, మొక్క ఎదిగే దశలో, కాయ పక్వానికి వచ్చే దశలో నీరు కడితే కాయలపై బీటలు వారే ప్రమాదం ఉందన్నారు. దీనిని రైతులు గమనించాలని సూచించారు.

**తెగుళ్ల నివారణ ఇలా...**

పుచ్చ పంటలో తెగుళ్లు, పురుగులు, బూజు నివారణకు మాంకోజెబ్ 2.5 గ్రాములు లేక మోటాలాక్సిల్ 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి మొక్కలపై పిచికారీ చేయాల్సి ఉంటుందని, బూడిద తెగులు నివారణకు కేరాథేన్ లేదా ట్రిడీమార్ఫ్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. కాయకుళ్లు తెగులు నివారణకు మోటాలాక్సిల్ లేదా మాంకోజెబ్ మిశ్రమం 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి అందించాల్సి ఉంటుంది. తామర పురుగు నివారణకు ఫిప్రోనిల్ లీటరు నీటికి 2మిల్లీలు చొప్పున కలిపి పిచికారీ చేయాలి. ఈ తరహా పంట విషయంలో అధికారుల సూచనలు పాటించడంతో దిగుబడులు సాధించవచ్చునని సూచించారు.

# నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న విజిలెన్స్ ఎస్ఐ రామరావు

గరుగుబిల్లి: ఎరువుల దుకాణదారులు ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని విజిలెన్స్ ఎస్ఐ రామారావు హెచ్చరించారు. ఖడ్గవలస జంక్షన్‌లో గాయిత్రి జనరల్ స్టోర్స్, శ్రీరామాంజేయ ట్రేడర్స్ దుకాణనాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎరువుల నిల్వలను, స్టాక్ రిజిస్ట్రేషన్‌లను, ధరల పట్టికలను పరిశలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు కొనుగోలు చేసి ఎరువులకు విధిగా రశీదును అందించాలన్నారు. ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్సులను రద్దు చేయడం జరుగుతుందన్నారు. ఈ పరిశీలనలో ఏఓ ఆర్.విజయభారతి తదితరులు పాల్గొన్నారు.

# పాడి రైతులకు మెరుగైన సేవలు : ఏడీ



సిబ్బందితో సమీక్షిస్తున్న పశు సంవర్ధక శాఖ ఏడీ గణపతిరావు

గరుగుబిల్లి: పాడి రైతులకు మెరుగైన సేవలను అందించాలని పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ గణపతిరావు సిబ్బందికి సూచించారు. మండలంలోని ఉల్లిబద్ర సచివాలయంలో గరుగుబిల్లి, జియ్యమ్మవలస మండలాల సిబ్బందితో శుక్రవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలవారీ లక్ష్యాలను అధిగమించాలన్నారు. కృత్రిమ గర్భోత్పత్తి, డీవార్మింగ్‌లు నిర్వహించాలన్నారు. పాల దిగుబడులను పెంచేందుకు రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. పశువులకు, జీవాలకు సంక్రమించే వ్యాధుల పట్ల రైతులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో వైద్యులు ఎస్.సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### మంచుతో ఇబ్బందులు



అపరాల పంట

గరుగుబిల్లి: ఖరీఫ్ వరి పంట ఆశాజనకంగా ఉన్నప్పటికీ రైతులు రెండో పంటగా వేసిన అపరాల పంటకు మంచు దెబ్బ కారణంగా తీవ్ర నిరాశకు గురి చేస్తుంది. మండలంలోని పలు గ్రామాల్లో 500 ఎకరాల్లో పెసర, 800 ఎకరాల్లో మినుమ పంటను సాగు చేస్తున్నారు. మొక్కలు పూత దశకు చేరుకున్న సమయంలో గత మూడు వారాలుగా మంచు కురువడంతో మొక్కలు పాలిపోవడంతో పాటు పలు రకాల తెగుళ్లు, పురుగులు ఆశిస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏపుగా పెరిగిన మొక్కలు రోజురోజుకు దెబ్బతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అపరాల పంటలపై రైతులు ఆశలు వదులుకోవల్సిందేనని రైతులు అంటున్నారు.

# సేంద్రియ ఎరువుల వినియోగంపై ఆసక్తి



ఉద్దవోలులోని పొలంలో గొర్రెల మంద

గరుగుబిల్లి: మండలంలోని రైతులు సేంద్రియ ఎరువుల వినియోగంపై ఆసక్తి చూపుతున్నారు. రసాయన ఎరువుల వాడకం వల్ల ఎదురయ్యే సమస్యలపై వ్యవసాయాధికారులు తరచూ అవగాహన కల్పించడంతో రైతులు సేంద్రియ ఎరువుల వినియోగంపై ఆసక్తి చూపుతున్నారు. ఇందులో భాగంగా గొర్రెలు, మేకలతో మందలను వేయించి భూమికి కావల్సిన పోషకాలను అందించడంతో పాటు రోగ నిరోధక శక్తి పెరుగుతుందని రైతులంటున్నారు. వేరుశనగ, అరటి, నువ్వులు, కాయగూరలు తదితర పంటలు సాగుతో పాటు వరి సాగు చేసే రైతులు గొర్రెల, మేకల మందలు వేస్తుంటారు. దీంతో పాటు పశువుల గత్తం చెరువుల్లోని మట్టిని కూడా పొలాల్లో వేయడంతో సారవంతంగా తయారవుతుందని రైతులు చెబుతున్నారు.

# చేపల పెంపకంతో ఉపాధి




జొల్లగూడ గ్రామంలో ఫిష్ వెండింగ్ నిర్మాణానికి భూమి పూజ

- ఫిష్ కియోస్కి, లైవ్ ఫిష్ వెండింగ్‌ల నిర్మాణానికి భూమి పూజ

గుమ్మలక్ష్మీపురం: చేపల పెంపకం, విక్రయంతో మంచిగా ఉపాధి పొందవచ్చని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి గోపికృష్ణ అన్నారు. మండల కేంద్రమైన గుమ్మలక్ష్మీపురంలో గ్రామంలో రూ.10 లక్షలతో చేపలు విక్రయించే దుకాణం (ఫిష్ కియోస్కి), జొల్లగూడ గ్రామంలో రూ. 20 లక్షలతో లైవ్ ఫిష్ వెండింగ్ (చేపలు పెంచే దుకాణం) ఏర్పాటు కోసం శుక్రవారం భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో మూర్తి, తారక్ అనే లబ్ధిదారులకు ఈ యూనిట్లు మంజూరు చేశామని, ఆయా నిర్మాణాలు సకాలంలో పూర్తి చేసి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విలేజ్ ఫిషరీష్ అసిస్టెంట్లు కొండగొర్రి ఇందిర, వై.వెంగలరాయుడు తదితరులు పాల్గొన్నారు.

### బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు మద్దతు

పార్వతీపురం: జనవరి 30,31 తేదీలలో నిర్వహించనున్న బ్యాంకుఉద్యోగుల సమ్మెకు సీఐటీయూ సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఆపార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మథ రావు శుక్రవారం తెలిపారు. ఈ మేరకు కరపత్రాలను పంపిణీ చేశారు. వేతన సవరణ, ఖాళీల భర్తీ, పీఎం మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, తదితర సమస్యలపై సమ్మెను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

### కలెక్టర్ దృష్టికి ధాన్యం కొనుగోలు సమస్య

గరుగుబిల్లి: మండల పరిధిలోని పలు గ్రామాలలో కళ్లాలలో నిల్వ వున్న ధాన్యం నిల్వలపై ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి దృష్టికి తీసుకెళ్లామని జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు శుక్రవారం తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్యే కలెక్టర్ నిషాంత్‌కుమార్‌తో మాట్లాడారు. గడిచిన రెండు రోజుల నుంచి ఏ రైతుకు సంబంధించిన ధాన్యం జియో ట్యాగింగ్ చేయడం జరిగిందో, ఆ రైతుల యొక్క ధాన్యం కొనుగోలు చేసేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందని కలెక్టర్ వివరించినట్లు తెలిపారు.

### మహాన్నదానం



అంపిలి గ్రామంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం

పాలకొండ రూరల్: అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న అని కోటదుర్గమ్మ దేవస్థానం ప్రధాన అర్చకులు దారల్వాడి లక్ష్మిప్రసాద్ శర్మ అన్నారు. మండలంలోని అంపిలి గ్రామంలో రామమందిరంలో శుక్రవారం చేపట్టిన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా రామాయణ విశిష్టతను భక్తులకు వివరించారు. ఈ క్రమంలో నిర్వహించిన మహాన్నదానంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో గ్రామ సర్పంచ్ లోలుగు విశ్వేశరరావు, వైస్ ఎంపీపీ వాకముడి అనిల్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకుడు బూరాడ తేజేశ్వరరావు, రామమందిర పురోహితులు హరిచంద్రపాడీ తదితరులు పాల్గొన్నారు.

### కేంద్ర విధానాలకు నిరసనగా ట్రాక్టర్ల ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న వామపక్ష నాయకులు

పార్వతీపురం టౌన్: రైతువ్యతిరేక మూడు నల్ల చట్టాలను రద్దు చేస్తామని కేంద్రప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని, రైతుపండించిన పంటలకు మద్దతు ధరల చట్టం తేవాలని, ఢిల్లీలో రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని కోరుతూ జిల్లా కేంద్రంలో వామపక్షాలు శుక్రవారం ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించాయి. ఈ ర్యాలీ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో మార్కెట్ యార్డ్ నుంచి సుందరయ్య భవనం వరకు సాగింది. ఈ సందర్భంగా రైతు సంఘాల నాయకులు మాట్లాడుతూ రైతుల దీక్షలను విరమించేందుకు ప్రధాని మోడీ ఇచ్చిన హామీలు తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు, ఈదుబిల్లి వెంకటనాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు బంటుదాసు, కరణం రవీంద్ర, రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు ఊయక ముత్యాలు, పి.శ్రీను నాయుడు (సంయుక్త, కార్యదర్శి), అఖిల భారత రైతు కూలీసంఘానికి చెందిన బొత్స నరసింగరావు, పోల రమణి తదితరులు పాల్గొన్నారు.

### ● ఆహారం కోసం వేట



రబీ సీజన్‌లో పొలంలో ఓ రైతు దమ్ము పడుతుంటే.. అదే సమయంలో ఆహారం కోసం వేటాడుతున్నాయి కొంగలు. భామిని మండలం కాట్రగడ – బి వద్ద పంట పొలంలో శుక్రవారం ఈ దృశ్యం కనిపించింది. రైతు దమ్ము పడుతున్న వేళ...చుట్టూరా... పదుల సంఖ్యలో కొంగలు దమ్ము పొలంలో ఆహారం కోసం వేటాడడం చూపరులను ఆకర్షించింది. – భామిని

# మా పొలాలకు దారి చూపరూ...



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

వీరఘట్టం: తమ పొలాలకు వెళ్లేందుకు దారిని చూపించాలని పలువురు రైతులు తహసీల్దార్ సి.హెచ్.సత్యనారాయణను శుక్రవారం కోరారు. పాలకొండ రోడ్డులో భారత్ గ్యాస్ గోదాం ఎదురుగా రోడ్డు పక్కన ఉన్న భూముల్లో కొందరు రియల్ ఎస్టేట్ వెంచర్లు వేయగా, మరి కొందరు తమ పొలాలకు కంచెలు వేస్తుండడంతో వెనుక ఉన్న తమ పొలాలకు దారి లేక ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోయారు. రోడ్డు పక్కన భూముల్లో ఇలా రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తే వెనుకన ఉన్న భూములకు మార్గం లేక బీడు భూములుగా మారుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అందుచే తమ పొలాలకు వెళ్లేందుకు దారి చూపించాలని వీరు కోరారు. దీనిపై తహసీల్దార్ సత్యనారాయణ స్పందిస్తూ సంబంధిత భూ యజమానులను పిలిపించి మాట్లాడి సమస్య పరిష్కారానికి చొరవ చూపిస్తానని తెలిపారు.

# రోడ్డు భద్రత అందరి బాధ్యత



మాట్లాడుతున్న మోటార్ వెహికల్ అధికారి వేణుగోపాలరావు

పాలకొండ రూరల్: రహదారి ప్రమాదాలు నివారించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని పాలకొండ ఆర్టీసీ డిపో మేనేజర్ పి.వెంకటేశ్వరరావు అన్నారు. డిపోలో 34వ రోడ్డు భద్రత వారోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పాలకొండ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాలరావు మాట్లాడుతూ వాహనచోదకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ట్రాఫిక్ నిబంధనలు, సిగ్నల్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సహాయ మోటార్ వెహికల్ అధికారి కిరణ్‌కుమార్, ఆర్టీసీ డిపోలో వివిధ శాఖల అధికారులు ఎస్.లక్ష్మణరావు, ఎంకెఎం.రాజు, పి.మధుబాబు, బి.రాంబాబు, ఎస్.నాగరాజు, పీవీ.ఆచారి, బీకే.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీలకు కనీస వేతనం ఇవ్వాలి



నిరసన తెలియజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పాలకొండ: అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు కోరారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీస వేతనం రూ.26వేలు అందించాలని, సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలని కోరారు. జీఓ నంబరు 1ని రద్దు చేయాలని, వైఎస్సార్ సంపూర్ణ పోషణ మెను చార్జీలు పెంచాలని కోరారు. యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు బి.అమరవేణి, జి.జెస్సీబాయ్, శారద, శ్యామలతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అవ్వాతాతలకు కంటి శస్త్రచికిత్సలు



అవ్వాతాతలకు నేత్ర చికిత్సలకు పంపిస్తున్న వైద్య సిబ్బంది

కురుపాం: వైఎస్సార్ అవ్వాతాతల కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా 35 మందికి విజయనగరం పుష్పగిరి కంటి ఆస్పత్రికి తరలించినట్లు మన్యం జిల్లా కంటి వెలుగు నేత్ర వైద్యాధికారి నగేష్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల పరిధిలో వైద్య శిబిరాలు నిర్వహించి కేటరాక్ట్, టేరిజియం, సమస్యలున్న వారిని గుర్తించామన్నారు. వీరికి ఉచిత రవాణా, వసతి, భోజనం, కంటి అద్దాలు, మందుల సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కంటి వైద్య సహాయకులు రోజా, మల్లిక, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఎంపీడీఓకు సన్మానం



ఎంపీడీఓకు సన్మానిస్తున్న ఎంపీపీ తదితరులు

సీతంపేట: రిపబ్లిక్ డే సందర్భంగా స్థానిక ఎంపీడీఓ కోసూరు గీతాంజలికి అవార్డు రావడంతో ఎంపీపీ బి.ఆదినారాయణతో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల ఉద్యోగులు, సిబ్బంది శుక్రవారం సన్మానించారు. మండల పరిషత్ కార్యాలయంలో దుశ్శాలువాలతో సన్మానించి అభినందించారు. మండలాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని వక్తలు కోరారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కె.సత్యం, ఏపీఓ సాగర్, బాబురావు, ఎంపీటీసీలు లక్ష్మి, మంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# జీరో ప్రమాదాల లక్ష్యం వైపు అడుగులు వేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా రవాణా అధికారి మల్లికార్జున రెడ్డి

- జిల్లా రవాణా అధికారి ఇ.మల్లికార్జున రెడ్డి

పార్వతీపురంటౌన్: జీరో ఆక్సిడెంట్ లక్ష్యం వైపు అడుగులు వేయాలని జిల్లా రవాణా అధికారి ఇ.మల్లికార్జున రెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో రోడ్డు భద్రతా వారోత్సవాలను జిల్లా ప్రజా రవాణా అధికారి టీవీఎస్ సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రవాణా అధికారి మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు చేపట్టవలసిన ముందు జాగ్రత్త చర్యలపై వారం రోజుల పాటు రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రమాదాలపై డ్రైవర్‌లు అవగాహన కలిగి ఉండడం వల్ల జీరో ఆక్సిడెంట్ లక్ష్యం వైపు అడుగులు వేయవచ్చని అభిప్రాయపడ్డారు. ముందు జాగ్రత్త చర్యగా వాహనాలను రోడ్డుకు ఎడమవైపున, రోడ్డు పక్కకు ఆపాలని డ్రైవర్‌లకు సూచించారు. కార్యక్రమంలో డీటీఓ శశికుమార్, ఎంవీఐ బి.కాశీరాం నాయక్, ఇన్‌చార్జ్ డిపో మేనేజర్ ఒ. సుమిత్ర, డ్రైవర్‌లు, ఆర్టీసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.